క్లుప్తంగా

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

గద్వాలటౌన్ : తెలంగాణ పీఆర్టీయూ జిల్లా మహిళా కన్వీనర్‌గా జమున నియామకమయ్యారు. ఈ మేరకు గురువారం సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఉమాకర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. జమున జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా జమున మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దు తన మొదటి ప్రాధాన్యమన్నారు. మహిళా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో అండగా ఉంటానన్నారు. అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తన వంతుగా కృషి చేస్తానన్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ



గద్వాలటౌన్ : జిల్లా కేంద్రంలోని 14వ వార్డు గంజిపేట కాలనీలో వార్డు కమ్యూనిటీ భవన నిర్మాణానికి గురువారం మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ భూమిపూజ చేశారు. నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలని చైర్మన్ సూచించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ శంకర్ మున్సిపల్ కమిషనర్ దశరథ్, నాయకులు కోటేష్, తిమ్మన్న, దినేష్, వంశీ, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ కాలేజీని మూసివేయాలి



ఇటిక్యాల : విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతున్న సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలను తక్షణమే మూసివేయాలని అలంపూర్ బీఎస్పీ ప్రధాన కార్యదర్శి మోహన్ రాజ్ డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని వావిలాల గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద పార్టీ ముఖ్య నాయకులతో కలసి మాట్లాడారు. మేడ్చల్‌లోని సీఎంఆర్ కళాశాల బాలికల హాస్టల్ బాత్రూంలలో వీడియోలు తీసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సంఘటనలో యాజమాన్యంపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, లక్ష్మణ్, దుబ్బన్న, నాగరాజ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదు



అయిజ: ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్‌తో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీసీసీ అధికార ప్రతినిధి శేక్షావలి ఆచారి ఆర్థిక లావాదేవీల వ్యవహారం కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని పార్టీ మండల అధ్యక్షుడు జయన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శేక్షావలి ఆచారి వ్యవహార తీరు పార్టీకి మచ్చ తెచ్చేదిగా ఉందని, ఆయన్ను సస్పెండ్ చేయాలని పార్టీ పెద్దలను కోరినట్లు తెలిపారు. శేక్షావలి ఆచారికి తూంకుంట గజేంద్ర గౌడ్‌కు మధ్య సంతరించుకున్న ఆర్థిక లావాదేవీల విషయం వారి వ్యక్తిగత విషయమేతప్పా కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



ఎర్రవల్లి : ఇటిక్యాల మండల పరిధిలోని పెద్ద దిన్నె గ్రామంలో వెలసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 8 నుంచి 13వరకు నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య అర్చకులు జయసింహా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు రోజుల పాటు జరగనున్న ఇట్టి ఉత్సవాలకు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను కనులారా తిలకించి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

కార్మికులకు న్యాయం చేయాలి



జిల్లా కేంద్రంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు నర్సింహ

గద్వాల : కార్మికుల ఆర్థిక ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని వారికి రేట్లను పెంచి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని గద్వాల స్టాక్ పాయింట్ వద్ద సమ్మె చేస్తున్న సివిల్ సప్లై హమాలీ కార్మికుల నిరవధిక సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కార్మికుల పోరాటం ఫలితంగా బోనస్ రూ.6500 నుంచి రూ.7500 పెంచుతామని ఇచ్చిన ప్రభుత్వ హామీ మూడు నెలలు గడుస్తున్నప్పటికీ నెరవేరలేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే జీవోను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో హమాలీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి..

అలంపూర్ రూరల్ : పట్టణంలోని స్టాక్ పాయింట్ వద్ద సమస్యలు పరిష్కరించాలని గురువారం హమాలీలు సమ్మె చేపట్టారు. సీఐటీయూ, టీయూసీఐ ఆధ్వర్యంలో ఎర్రజెండాలు చేతపట్టి సమ్మె చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా హమాలీ కార్యదర్శి పెద్ద మద్దిలేటి , ఖాజా, విశ్వనాథం, సాయిబాబా, కన్న, సునిల్, భూపాల్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జీఓ వెంటనే విడుదల చేయాలి ..



అయిజలో మాట్లాడుతున్న వెంకటస్వామి

అయిజ: సివిల్ సప్లై హమాలీ కార్మికులకు పెంచిన హమాలీ రేట్ల జీవోను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి అన్నారు. మండల కేంద్రంలోని సివిల్ సప్లై స్టాక్ పాయింట్ వద్ద హమాలీలు చేస్తున్న నిరవధిక సమ్మెను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పౌర సరఫరా సంస్థలో పనిచేస్తున్న సివిల్ సప్లై హమాలీ కార్మికుల ఎగుమతి, దిగుమతిపై ఒప్పందం 2023 డిసెంబర్‌తో ముగిసిందని , నూతన రేట్లకు పెంపుపై కార్మిక సంఘాల సమక్షంలో అధికారులు 2024 అక్టోబర్ 3వ తేది చర్చలు జరిపి ఎగుమతి దిగుమతి నూతన రేట్లను ప్రస్తుతం ఉన్న రూ. 26 నుంచి 29కి పెంచారన్నారు. పెరిగిన రేట్లను 2024 జనవరి నుంచి అమలు చేస్తామని ఎరియర్స్‌తో సహా చెల్లిస్తామని, మహిళా స్వీపర్లకు గోదాముల సామర్థ్యాన్ని బట్టి ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనాలపై అదనంగా రూ. 1000 ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇంతవరకు జీఓ కూడా జారీ చేయలేదని మండిపడ్డారు. కార్మికులకు న్యాయం జరుగకుంటే నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

పాఠశాల సందర్శించిన ఎమ్మెల్యే



మౌలిక వసతులపై చర్చిస్తున్న ఎమ్మెల్యే విజేయుడు

మానవపాడు: మండలంలోని చిన్నపోతులపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం ఎమ్మెల్యే విజేయుడు సందర్శించారు. భోజన మెనూ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పాఠశాలలో మౌలిక వసతులపై ఆరా తీశారు. సమస్యలపై ప్రధానోపాధ్యాయుడితో చర్చించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజశేఖర్‌రావు, యుగంధర్, చిన్న బీచుపల్లి, ఈశ్వరయ్య, మైబు, పుల్లారు, రఘురెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

అలంపూర్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్ లోని ఎమ్మెల్సీ నివాసంలో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల సర్వేలో సూపర్ చెక్



సర్వేలో ఎంపీడీఓ వెంకటయ్య

అయిజ : మండలంలోని వెంకటాపురంలో ఎంపీడీఓ వెంకటయ్య గురువారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే సూపర్ చెక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం మండలంలో మొత్తం 14,330 మంది ప్రజలు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు గత నెలలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కార్యక్రమం నిర్వహించారని, ప్రస్తుతం సూపర్ చెక్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వెంకటాపురంలో 302 ఇళ్ల జాబితాను పరిశీలించి గతంలో సర్వే చేశారని, ఇప్పుడు సూపర్ చెక్ 5 శాతం ప్రకారం 11 ఇళ్లను తనిఖీ చేసి యాప్‌లో అప్‌లోడ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వాతి, ఫీల్డ్ అసిస్టెంట్ దేవదాస్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



తప్పెట్లమొర్సులో పూజలు చేస్తున్న పాల్గొన్న ఆంజనేయగౌడ్

గట్టు : బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్ కోరారు. గురువారం తప్పెట్లమొర్సు గ్రామంలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కష్టపడే వారికి పార్టీ ఎప్పుడు అండగా ఉంటుంన్నారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన పెద్దమ్మవ్వ దేవర సందర్భంగా దేవాలయంలో బల్గెర హనుమంతునాయుడుతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. దేవర సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, రాము, కొళాయి భాస్కర్, వీరేష్, సత్యం, మోహన్‌గౌడ్, మధు, తిమ్మప్ప, వీరేష్, శివన్న, చిన్నరాముడు తదితరులు పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో ఆంజనేయగౌడ్ పూజలు..

మల్దకల్ : ఆదిశిలా క్షేత్రం స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామిని గురువారం తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు.

రెండు ఇసుక టిప్పర్లు పట్టివేత



ఎర్రవల్లి: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను అదుపులోకి తీసుకున్నట్లు ఇటిక్యాల ఎస్సై వెంకటేష్ గురువారం తెలిపారు. టిప్పర్ల ద్వారా బుధవారం అర్ధరాత్రి గద్వాలకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న క్రమంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న స్థానిక పోలీసులు ఎర్రవల్లి కూడలిలో పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. నంద్యాల జిల్లా పాణ్యంకు చెందిన టిప్పర్ల యజమాని మహేందర్‌తో పాటు డ్రైవర్లు బెక్కెం సురేష్, షేక్ గోకారి బాషలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బస్టాండ్ ప్రహరీ నిర్మాణాన్ని అడ్డుకున్న ప్రజలు



ప్రహరీ నిర్మాణాన్ని చేపడుతున్న అధికారులు

మానవపాడు: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ చుట్టూ చేపడుతున్న ప్రహరీ నిర్మాణాన్ని స్థానిక ప్రజలు అడ్డుకున్నారు. ప్రహరీ నిర్మాణం వలన డ్రైనేజీ, రోడ్డు వెడల్పు లేకపోవడం వలన ఇబ్బందులు ఏర్పడనున్నట్లు అధికారులతో తెలిపారు. బస్టాండ్ ఆవరణలో కనీస సౌకర్యాలు లేవని, సమయానికి బస్సులు రావడం లేదని అధికారులకు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ చంద్రకాంత్ వారం రోజుల్లో సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు.

వారంలో డీడీ చెల్లించాలి..

ఆర్టీసీ బస్టాండ్ స్థలంలో ఉన్న షాపు యాజమానులు డీడీలు చెల్లించిన వారికి ఆర్టీసీ స్థలంలో షాపులకు అనుమతులు ఉంటాయని ఆర్టీసీ డిప్యూటీ రీజనల్ మేనేజర్ ధర్మతేజ తెలిపారు. వారం రోజుల్లో డీడీ చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఇంజినీర్ ప్రసాద్, సూపరింటెండెంట్ లక్ష్మయ్య, ఏఈ సంపత్‌కుమార్, క్లర్క్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

దేవబండ గ్రామాన్ని పంచాయతీగా ప్రకటించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

అయిజ: మండలంలోని దేవబండ గ్రామాన్ని గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కలెక్టర్ సంతోష్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు సంకాపురం రాముడు మాట్లాడారు. మండలంలోని 16 ఎంపీటీసీ స్థానాలను 22కు పెంచాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం 3వేల కంటే ఎక్కువ ఓట్లు ఉన్న ఎంపీటీసీ స్థానాలను రెండుగా చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తుందన్నారు. కావున 3వేల ఓట్ల కంటే ఎక్కువగా ఉన్న తూంకుంట, ఉత్తనూరు, తొత్తినోనిదొడ్డి, సింధనూరు, పులికల్, చిన్న తాండ్రపాడు గ్రామాల్లో మరో 6 ఎంపీటీసీ స్థానాలను పెంచే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పరమేష్ గౌడ్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం

అయిజ: నేరం చేసినవారు ఎంతటి వారైనాసరే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని శాంతినగర్ సీఐ టాటాబాబు అన్నారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సీఐ సందర్శించారు. అయిజ పట్టణానికి చెందిన వెంకటరమణ, శేక్షావలి ఆచారిలు తూంకుంట గ్రామానికి చెందిన గజేంద్ర గౌడ్‌పై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇటీవల చీటింగ్ కేసు పెట్టారు. అదే విధంగా గజేంద్ర గౌడ్‌పై శేక్షావలి ఆచారి దాడికి పాల్పడినట్లు గజేంద్ర గౌడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇరువురు ఒకరిపై మరొకరకు ఫిర్యాదు చేసుకున్న సందర్భంగా సీఐ టాటాబాబు విచారణ చేపట్టారు.అదే విధంగా మొత్తం 42 రౌడీ షీటర్ల రెన్యువల్ జాబితాను పరిశీలించారు. 72 మంది అనుమానితుల దొంగల జాబితాను పరిశీలించి రెన్యువల్ చేసినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో ఇంటర్ విద్యార్థులకు, ధరూర్‌లోని డిగ్రీ గురుకులాల అధ్యాపకులు వనజ, జ్యోతి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదవడానికి డిగ్రీ ముఖ్యంగా ఉంటుందన్నారు. సామాన్య విద్యార్థుల కోసమే గురుకులాల్లో డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవానందం, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులను బయటకు ఎందుకు పంపుతున్నారు..?



మాట్లాడుతున్న తహసీల్దార్ వాహీదా ఖాతూన్

మానవపాడు: పాఠశాల బయటకు, విద్యార్థులను ఎందుకు పంపుతున్నారు..? మధ్యాహ్న భోజన సమయంలో పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఎంఈఓ శివప్రసాద్‌పై తహసీల్దార్ వాహీదా ఖాతూన్ ప్రశ్నించారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాల ఆవరణ చుట్టూ అపరిశుభ్రంగా ఉందని, మధ్యాహ్న భోజన సమయంలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో మందు సీసలు దర్శనమిస్తున్నాయని వాపోయారు. పాఠశాల ఆవరణంలో విద్యార్థులు ఉండాలని పాఠశాల బయట ఎందుకు వెళ్తున్నారని ప్రశ్నించారు. ఈ విషయంపై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ శివప్రసాద్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ల ఆవిష్కరణ



శాంతినగర్ : పీఆర్టీయూ టీఎస్ ఉపాధ్యాయ సంఘం 2025 క్యాలెండర్‌ను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఆవిష్కరించారు. వడ్డేపల్లి మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసులు, ఎంఈఓ నరసింహ చేతుల మీదుగా విడుదల చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దేవేందర్ రెడ్డి, వెంకటేష్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

మాచర్లలో..

గట్టు : మండల పరిధిలోని మాచర్ల ఉన్నత పాఠశాల ఆవరణలో పీటీఆర్‌టీయూ టీఎస్ క్యాలెండర్‌ను ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయుటీఎస్ సంఘం మండల అధ్యక్షుడు రంగన్న, నాయకులు వెంకటేశ్వర్లు, మోహన్‌రెడ్డి, రాంబాబు, నర్సింహులు, చరణప్ప తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ..

మల్దకల్: మండల కేంద్రంలోని హైస్కూల్‌లో గురువారం పీఆర్‌టీయూ టీఎస్ 2025 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ, టేబుల్ క్యాలెండర్లను పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు, ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నర్సింహారెడ్డి, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు నర్సింహారెడ్డి, వెంకట్రాములు, గోవిందు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు అండగా ఉంటా



గద్వాలటౌన్ : ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు అండగా ఉంటానని నూతనంగా ఎన్నికైన సంఘం జిల్లా అధ్యక్షుడు బీఎస్ కేశవ్ అన్నారు. గురువారం స్థానిక పాత హౌసింగ్ బోర్డు కాలనీలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం 2025 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేశవ్ మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధిలో విశ్రాంత ఉద్యోగులు భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు త్యాగరాజు, శ్రీమన్నారాయణ, విశ్రాంత ఉద్యోగులు బసన్న, రాజశేఖర్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు కోటేష్, జనార్ధన్, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



యాప్రాన్ కోట్‌లను అందిస్తున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు

ఇటిక్యాల : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల పరిధిలోని చాగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. వంటశాలను పరిశీలించి పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్ ప్రత్యేకంగా కుట్టించిన యాప్రాన్ కోట్‌లను సీసీహెచ్‌లకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్, తవిటినాయుడు, హరిబాబు, లక్ష్మయ్య, నరసింహ, రాజు, రాములు, తదితరులు పాల్గొన్నారు.

ధరూరు : మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ఇన్‌చార్జి ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. గురువారం మండల పరిధిలోని సోంపురం, పారుచర్ల గ్రామాల్లోని పాఠశాలలను ఆయన సందర్శించారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను సందర్శించారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన



ఉండవెల్లి: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గురువారం ఏఎస్ఐ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కళాబృందం సభ్యులు మాదక ద్రవ్యాలు, సీసీ కెమెరాల ఉపయోగంపై, డయల్ -100, రోడ్డు సేఫ్టీ, సైబర్ క్రైమ్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ కళా బృందం సభ్యులు రాధమ్మ, రామాంజనేయులు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ



సర్టిఫికెట్ తీసుకుంటున్న ఉరుకుందమ్మ, తిరుమలేష్

ధరూరు: డిసెంబర్ 31 నుంచి ఈ జనవరి 1వ తేదీ వరకు బీహార్‌లోని పాట్నాలో నిర్వహించిన జాతీయ స్కూల్ గేమ్స్‌లో ధరూరు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు పాల్గొన్నట్లు పాఠశాల జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఉరుకుందమ్మ అండర్- 14 బాలికల విభాగంలో రగ్బీలో, బాలుర విభాగంలో విద్యార్థి తిరుమలేష్ పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



మానవపాడు: రోడ్డు ప్రమాదాల నివారణకు వాహన దారులకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 1 నుంచి 31 వరకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు సైదా, అమృతవర్షిణి తెలిపారు. ఈ నేపథ్యంలో జల్లాపురం చెక్‌పోస్ట్ వద్ద వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహనదారులు హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించడం, మద్యం తాగి వాహనాలు నడుపరాదని, ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. ఆరోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ క్రిష్ణకుమార్, హోంగార్డు వినోద్ తదితరులు పాల్గొన్నారు.